ఇంద్రధనుస్సు

★

"శివం"

"అమ్మా" అంటూ దీర్ఘంగా, బాధతో కూడిన కేక వేసేడు నాలుగేళ్ళ రాముడు.

"అబ్బా! ఏమిటిరా—" అని ఏదో అనబోతున్నాడు తనింకాను. అంతే, వాడు ఏడుపు మొదలెట్టాడు. ఒక్క మొండిగోలు గాయి... ఒకటే ఏడుపు.. అదే మంచంమీద పడుకున్న తన చెవులు చిల్లులు పడిపోతున్నాయి.

వీధి కటకటాల తలుపులు తీసుకొని వంటింటిలోనుండి వచ్చింది అది. ఒచ్చి సమాచార మేమిటో కనుక్కోవడమూ అదీ ఏమన్నా వుంటేనా? అబ్బే. తిన్నగా తనమీదే మొదలుపెట్టింది మొగుడువాడి. "ఒక్క క్షణం వాడిని వూరికే వుండ నివ్వరుకదా! ఏంచేసేరు వాడిని? కాలుతొక్కేసేరా? పడుకుంటే వళ్ళు తెలియదా ఏమిటి! రామ, రామ! ఒక్క క్షణం యీ ప్రాణాన్ని సుఖాన్ని వుండనివ్వరు కదా. వాడు అటువైపు వత్తిగిలి పడుకుంటే మిమ్మల్ని ఏంచేసేడు? ఊరంత మంచం పడవేసేను కదా—హాయిగా పడుకోక వాడి కాలు త్రొక్కడం దేనికి చెప్పండి?"

ఏం మాట్లాడతాడు తను? అసలు మాట్లాడనిస్తేనా? ఈ మధ్య దాని ధోరణే పూర్తిగా మారిపోయిందిలే. ఈ యింట్లో జరిగే ప్రతీ అవకతవకకీ తనే కారణం అన్నట్లు మాట్లాడుతోందది. నిజానికి ఆ కుర్రవెధవను ఏం కుట్టిందో, ఏమో? లేకపోతే కడుపులో అజీర్తిబాధో? కాకపోయినా, అస్తమానం ఎందుకో వకందుకు వాడికి ఏడవటం అలవాటయి పోయిందిలే! ఎంత అరచినా కారణం చెప్పడు వాడు. వీళ్ళే వూహించుకుంటారు సాధ్యమైనంతవరకూ తనే అందుకు బాధ్యుడయివుంటాడు వీళ్ళవూహాలో? ఏదో తెలియని బాధతో అవస్థ పడుతున్నాడు వాడసలు. లేకపోతే అస్తమానం ఎందుకు అల్లా ఏడుస్తూంటాడు?

"ఏం నాయనా? తాతయ్యగారేమైనా చేసేరా? మా నాయన కాదూ? నేను ఎత్తుకుంటాను. దా. రావూ...పోన్లే నీకు వేరే మంచం వేస్తాను... హాయిగా పడుకుందువుగాని దా. ఏం? ఒద్దూ... ఏంకావాలిరా మరి... వూరుకోరా. అల్లా అస్తమానం ఏడిస్తే కళ్ళుకూడా పోతాయి...వూరుకో... మా బంగారపు కొండవుకదూ... పటిక బెల్లం పెట్టనా...ఏమిటిరా...ఏమిటి నీ బాధ.. తాతయ్యగారు తొక్కేరా...ఎక్కడ తొక్కేరు?... తాతయ్యగార్ని కొడతానుండు—అమ్మ, మరీ భయం భక్తీ లేకుండా మా రాముడ్ని తొక్కుతారూ! తాతయ్యగార్ని కొట్టేనులే... ఇక వూరుకో...వూరుకోరా—ఏమిటి నీ బాధ... ఎక్కడ? ఏమైనా దయ్యముగాని పట్టిందేమిరా... వూరుకో... చూడు ...చందమామ ఎల్లాపరుగెత్తుతున్నాడో...అబ్బే... మధ్య నేను చచ్చిపోతున్నానమ్మా... ఆ దయ్యమేదో మమ్మల్ని పట్టుకున్నా బ్రతికిపోదుము, ఆ కుర్రాడిని ఏడ్పిస్తే ఏమొస్తుందో దానికి!"

మాటాడితే యిదొకటి! వాడికి లోపల లివరో ఏమో! వూరికే ఏడుస్తాడు. డాక్టరుకు చూపిస్తే డబ్బు కావలసివస్తుందని తనకొడుకు, వాడిని డాక్టరు వద్దకుకూడా తీసుకొనివెళ్ళడు. వీళ్ళు దెయ్యమని దేవతనీ, నెపవమాటలు! డాక్టరుకు చూపిస్తే అది ఎప్పుడో నయమయ్యి వూరుకునేది.

"దయ్యమూ లేదు, దేవతా లేదు. వాడిని వకసారి డాక్టరుకు చూపించరాదటే!" అన్నాడు తను.

"డాక్టరెందుకు? హాయిగా తిని తిరిగేవాడికి రోగమేమిటే? అయినా వళ్ళు తెలియకుండా ఏమిటా బండ నిద్ర! కుర్రాడి కాలుతొక్కేసి, వాడిని ఏడ్పించి పైగా డాక్టరుట, డాక్టరు! డాక్టర్లు వూరికే వచ్చి మందిస్తారా? లేకపోతే మీరు సంపాదించి తెచ్చినదంతా కుళ్ళిపోతోందనా! నాకు లోపల పనుంది, మీతో వాగుతో కూర్చోలేను. వాడిని కాస్త ఆడించండి."

తనకు చాలా బాధగా వుంటుంది అది అట్లా ఎత్తిపొడుస్తూ, యీసడింపుగా మాట్లాడితే. రెండేళ్ళ నుంచీ యి దే వరస. రెండేళ్ళ క్రితమేగా తను పూర్తిగా అశక్తుడయిపోయి రోగంతో మంచం ఎక్కింది. అంతా తను పోతాడనుకున్నారు. కాని ఎందుకు బ్రతికేడో, ఆ భగవంతుడికే తెలియాలి—బ్రతికేడు! కాని పూర్వపు ఆ శక్తీ, వుత్సాహాలు తనలో మచ్చుకైనా లేవిప్పుడు. లేవని, వూరికే కూర్చుంటే ఎట్లా? ఎన్నాళ్ళిట్లా కొడుకు రెక్కల కష్టముమీద ఆధారపడివుంటాగు, తామిద్దరూ? ఇంకా తనకు అన్పిస్తూనేవుంది; ఎక్కడైనా వుద్యోగం చేదామని. కాని ఎవరిస్తారు తనకు వుద్యోగం? నిజమే. అరవయి ఏళ్ళొచ్చిన తనకు ఎవరిస్తారు వుద్యోగం? అని, కొడుకు తెచ్చే వంద రూపాయల మీద తామిద్దరూ ఎన్నాళ్ళిట్లా ఆధారపడటం?

"ఏమండోయి—మిమ్మల్నే! వాడు మళ్ళీ ఏడుస్తున్నట్లున్నాడు. కొంచెం సముదాయించండి. ఎనిమిదవ్వకుండానే వూరంత నిద్ర!" లోపల్నుంచి విసుగుకుంటూ కేక వేసిందది.

తనమాట యీ మధ్య భార్యే వినడము మాని వేసింది. నాలుగేళ్ళ కుర్రకుంక ఏం వింటాడు? వాడి ధోరణివాడిదే! అర్థంలేని దరిద్రపు ఏడుపు! అస్తమానం యీ కొంపలో ఎవరోవకరు ఏడుస్తూండబట్టే దరిద్రముకూడా పట్టుకున్నది. మామూలు దరిద్రము కాదు. భరింపరాని దరిద్రము. తనకు తొడుక్కోడానికి వక చొక్కా ముక్క లేదు. కుర్రాడికి మందిప్పించడానికి సత్తాలేదు. తన కొడుకు చెప్పులు కొనుక్కోడానికి చేసేప్రయత్నం, రెండేళ్ళనుంచీ ప్రయత్నంగానే వుండిపోయింది. దీనికి అంతూదరీ అంటూ కన్పించడంలేదు. కాని ఎవరేంచేస్తారు? ఎవరో ఏదో చెయ్యాలి! తనమట్టుకు తనకింకా వుద్యోగం చెయ్యాలనే వుంది. ఎవరితోనూ చెప్పకుండా ఏ తెనాలో వెళ్ళిపోయి షావుకారుకొట్లో గుమాస్తా వుద్యోగం సంపాదిస్తేగాని తనకి మనశ్శాంతి వుండదు. తన భార్య తనను గౌరవదృష్టితో చూడదు. అప్పటికి కాని యీ యింటి దరిద్రంకూడా తీరదు. ఛీ! లేకపోతే ఏం బ్రతుకిది? ఎంత లోకువయి పోయేడు తను ప్రతీవాళ్ళకూ. తన మాటంటేనే విలువలేదిప్పుడీ కొంపలో. ఒకనాడు తను నెలకు వందలకు వందలు దోసిళ్ళతో గుమ్మరిస్తోంటే అంతా తనన్నెట్లా గౌరవించేవాళ్ళు? ఇప్పుడు మాత్రం తను తెనాలివెడితే ఏ షావుకారు కాదంటాడుతనని. ఇంకే మాత్రము తనీ యింట్లో వుండలేడు. నిన్న మట్టుకు నిన్న ప్రొద్దున్న......

ఆకలితో కడుపుమండిపోతోంది. కోడలుతో అన్నాడు తను—

"శ్యామలా. నీ అత్తకి దయలేకపోతే పోనీ గాని, నీకైనా లేదా!"

"అయ్యో! వస్తున్నానండి. కుర్రాడు ఏడుస్తూంటే సముదాయిస్తున్నాను." అంది శ్యామల చిచ్చి కొడుతూన్న కుర్రాడిని నెమ్మదిగా ప్రక్కమీద పరుండబెడుతూ.

"నోజుగోజుకీ మరీ కుర్రాడైపోతున్నారు! ఇంకా ఎనిమిది దాటలేదు—అప్పుడే భోజనానికి తొందరొచ్చింది. మహాపాటుపడి వచ్చేరని." యీసడించింది అది.

"నేనుకూడా తింటాను, తాతయ్యతో..." గునుస్తూ అన్నాడు రాముడు.

"అట్లాగేరా మా బంగారం! శ్యామలా, కంచాలు తీసుకురా, యిక. ఎవరూ ఏడుస్తోంది అట్లా..." అడిగేడు తను పట్టుపంచ సవరించుకుని నెమ్మదిగా గుమ్మముమీద కూర్చుంటూ.

"ఇంకెవరూ, లంఖిణీదేవి! ఇదిగో తెస్తున్నాను కంచాలు." అన్నది శ్యామల కంచాలకోరకు మంచము క్రింద దూరుతూ.

"ఎందుకొచ్చిన ఏళ్ళండీ! అరవయి ఏళ్ళొచ్చేయి. శుక్రవారంపూట గుమ్మముమీద కూర్చోవచ్చా? దిగండిముందు." గదిమింది సీతమ్మ పొయ్యిమీదనుండి అన్నపుగిన్నెను దించుతూ.

"కాలము మారిపోతోవుంటే మనుష్యులు మారిపోక ఏంచేస్తారు! ముందు రామయ్య నాన్నకు అప్పడాలు కాల్చు...కరకర నములుతాడు కాస్సేపు." అన్నాడు తను కోరికగా అప్పడాల డబ్బావైపే చూస్తూ.

"ఊ...అప్పరాలు... అప్పరాలు... భలే... మామ్మా...అప్పరాలే నాకు..." రాముడు మారాం చేయనాగేడు.

"అబ్బబ్బ...వూరికే కూర్చోరు కదా మీరు! ఏదో నాపీకమీదకు తీసుకొస్తారు. ఇప్పుడు అప్పడాల సంగతి ఎందుకు చెప్పండి...కూర, పచ్చడీ, చారు, వున్నాయి కదా...ఈ ప్రాణాన్ని సుఖాన్న వుండనీయరు కదా..." చీదరించుకున్నది అది.

శ్యామల పీటలు వేసి కంచాలు పెట్టి చెప్పింది, "మీరీ పెద్ద పీటమీద కూర్చోండి, రాముడే బుల్లి పీటమీద కూర్చుంటాడు."

"అబ్బ...పోవవచ్చేట్లుందేయిక...అయినంత మట్టుకు వడ్డించు" అన్నాడు తను పీటమీదకు జరిగి

నెమ్మదిగా చారులోకి పోపు తయారుచేస్తున్న సీతమ్మతో.

"అప్పడమే... ముందు అప్పడం యియ్యి నాకు." అంటూ సణుగుతూనే రాముడు కంచాన్ని వక్క తిన్ని తన్నేడు.

"చూసేరా మీరు చేసిన ఘనకార్యం! వేళకి యింత తినేసి అవతలకు దయచెయ్యటం లేదు కదా... ఏదో మా రాముళ్ళు పెడుతుంటారు. అప్పడం కాల్చి యిస్తాను గాని కాసేపు ఆగు రామయ్యా. నువ్వు. ముందు తాతగార్ని తిననియ్యి. మనం కాస్సేపుండి హాయిగా తిందాము అప్పడాలతో."

ఇంతలో యింట్లో మళ్ళీ ఎవరో ప్రారంభించేరు ఏడుపు. భోజనం ముందు కూర్చున్న తను అడిగేడు "ఎవరూ వూరికే అక్కడ ఏడుపు?"

"మా చిన్న మనమడు సుబ్బులు. గాలి లేనట్లుంది, ఏడుస్తున్నాడు."

తనకి ఎవరైనా ఏడుస్తూంటే భోజనం సని పడదు. తలపగిలి పోతూన్నట్లుంటుంది. "అబ్బబ్బ. వాణ్ణి కాస్సేపు ఎవరైనా అవతలకు తీసుకువెడుదురూ." అన్నాడు తను.

"మీ భోజనానికి అడ్డం కాబోలు వాడు! కానివ్వండి, ఫర్వాలేదు. అబ్బ! వంటినిండా అట్లా మెతుకులు పోసుకుంటూ తింటే, ఎటా? అవి తీసేసి, యీ నీళ్ళు చల్లుకోండి, మోకాలి పైన. మరీ చిన్న కుర్రాడై పోతున్నారు!" రాముడికోసం అప్పడాలు కాలుస్తూ సీతమ్మ మందలించింది తనను.

ఆ అప్పడాన్ని చూస్తూంటే తన నోరూరుతూంది, వూరికే. కాగా అన్నాడు తను, "సరే గాని, ఆ కాలుతూన్న అప్పడం యిట్లా పడవెయ్యి... నెమ్మదిగా నములుతాను."

"ఊ! నాకే... నాకు ముందియ్యి." రాముడు మారాం చేయసాగేడు.

"ఉండు నాన్నా, నీకు తర్వాత యిస్తాను. ముందు తాతయ్యగారికి కావాలిట." తన విస్తట్లో పడేసింది అప్పడాన్ని.

"తాతయ్యా... పీతయ్యా..." అన్నాడు కోపంగా రాముడు.

"తప్పురా, నా బంగారం!" అన్నాడు తను అప్పడాన్ని విరుస్తూ.

"తాతయ్యని... మరే... బొమ్మను." అన్నాడు బొమ్మలో వాడు రుసరుసలాడుతూ.

"అప్పడం బాగా నేపుండే!" అన్నాడు తను వాడి మాటలు పట్టించుకోకుండా.

"మిమ్మల్ని రాముడు పొమ్మంటున్నాడు - విన్నారా" అంది సీతమ్మ.

"పోయేవాడినే గాని ఎక్కడకు పోవాలో తెలియడములేదురా, నా బంగారం" అన్నాడు తను ఆలోచిస్తూ.

"ఏట్లోకి పో!" అన్నాడు రాముడు.

ఫక్కున నవ్వేరు అంతాను. విరగబడి నవ్వేరు అంతాను. కాని తనకు నవ్వురాలేదు. తన పళ్ళ సందున అప్పడం ముక్క యిరుక్కున్నట్లు అయ్యింది.

* * *

అబ్బాయి పెందరాళే భోజనం చేసేసి, డ్యూటీకి వెళ్ళిపోయేడు. ఆయన భోజనం, పిల్లల భోజనం కూడా అయ్యింది. కోడల్దికూడా అయ్యింది. అయినా, వంటిల్లింతా మహాసముద్రంలాగ వుంది పనితో. అంట్లగిన్నెలన్నీ దొడ్లో పడేసి, భోజనానికి కూర్చోబోతూన్నది తను. రాముడు పక్క గావు కేకతో ఏడుపు ప్రారంభించేడు. శ్యామల తనకేమీ పట్టనట్లు నెమ్మదిగా అంట్లు తోముకుంటూన్నది దొడ్లో!

తను లేచి, వెంటనే వాకిట్లోకి పరుగెత్తింది. వాడు 'కుర్రోమొర్రో' అంటూ వుంటే, ఆయన తేలుకుట్టిన దొంగలాగ మంచంమీద అట్లాగే పరుండి వున్నారు. తనకు తెలుసు! ఆయన నిద్రలో, వాడి కాలు తొక్కి వుంటారు! అయినా ఎనిమిదవకుండానే అంత మొద్దు నిద్దరేమిటో? రాముడిని వోదార్చే సరికి అరగంట పట్టింది. ఆయన కాస్త లేచి, ఆ కుర్రాడిని వోదారిస్తే ఎంత బావుంటుంది? తనకి వళ్ళు మండుతుంది ఆయన తీరు చూస్తూంటే. కుర్రాడు కాలు నొప్పితో ఏడుస్తూంటే, వాడికి 'రోగమో, రొచ్చో' డాక్టరుకు చూపించమంటారు, పైగాను, ఏమిటో! ఈయనకసలు మతివుండటం లేదీ మధ్యను. ఏదో మునిగిపోతూన్నట్లు ఎప్పుడూ మాయ ఆలోచనలు! పరధ్యానం! మొన్న మట్టుకు మొన్న అబ్బాయి పంచను, కండువా అనుకొని భుజాన వేసుకొని ఆఫీసు వైపు వెళ్ళిపోయేరు. నయం! ఆ ఎదురింటివాళ్ళ యింటికి వెళ్ళి యింకా ఏ తుండూ తీసుకురాలేదు! లేనిపోని అప్రదిష్ట కూడాను. పనంతా వంటింట్లో ఎక్కడిది అక్కడ వుండిపోయిందని, కుర్రాడిని ఆయన వద్ద కూర్చోబెట్టి 'కాస్త ఆడిస్తూండండి.' అని చెప్పి వంటింట్లోకి వచ్చింది తను. ...తనకి చోద్యమవుతుంది, ఎవరి మట్టుకు వాళ్ళకి ఎంతెంత కోపాలమ్మా! ఆయన మట్టుకు ఆయనకి చీటికీ మాటికీ కోపం.

అభ్యాయిసంగతి చెప్పనే అక్కరలేదు. ఎప్పుడూ ముక్కునవుంటుంది. ఇక యీ విడ—'నే నేం తక్కువతిన్నానా' అన్నట్లుంటుంది! అరడజను గిన్నెలున్నాయో లేదో, వేరెపనేమీ లేదన్నట్లు తీరుబడిగా, గంటలకొలదీ తోముతూ కూర్చుంటుంది. కుర్రకుంక ఏడుస్తున్నాడని, సముదాయించుకుందామని ఏకోశానావుంటేనా? కొంచెం త్వరగా తెమల్చమన్నా అంటే, తనమీద విరుచుకు పడింది అమాంతంగా. ఏం మాట్లాడినా నోట్లో వుండు! అక్కడికీ నోరు నొక్కుకొని తనకెందుకని, చేతనైనంతమట్టుకు లాగుకొస్తోంది తనీసంసారాన్ని. ఇక్కడ వరస చూస్తోంటే, పగవాడికైనా వద్దురా దేముడా, యిట్టాంటి సంసార, అన్పిస్తుంది.

తను కాబట్టి గుండెను రాయిచేసుకొని, యీడుకొస్తూన్నది యీ సంసారాన్ని రెండేళ్ళనుంచి. మరోరయితే విక్షిప్తలోనో దూకేవారే, యీపాటికి! వందరూపాయలతో నెలంతా నలుగురిని యీడ్చుకు రావడం మాటలతో వుండేమిటి? వాడెక్కడో నానా అవస్థలూపడి మధ్యమధ్య అప్పుకూడా తెస్తున్నాడనుకో. అయినా, యీ వందలోనుంచేగా ఆ అప్పులుకూడా తీర్చేది? ఈయన స్థిరంగా వక చోట కూర్చునివుంటే తనకింత బాధగా వుండక పోయేది. కూర్చోరు కదా! ఒక రోజున తెనాలి వెళ్తానంటారు. మరోరోజు రాజమండ్రీ వెళ్తానంటారు. ఒట్టి చలచిత్తపు మనిషి అయిపోతూంటే! ఏమైనా అంటే పుట్టెడు కోపమను. శరీరము బాగావున్న రోజుల్లో జాగ్రత్తపడి యీయన నాలుగు డబ్బులుకూడ బెడితే తమకీ అగచాట్లుండేవి కాదు కదా! ఆ జూదాలు...ఆపి కార్లు...ఎన్నిందాలో అన్నీ వెలిగించేరు ఆ రోజుల్లో. ఇప్పుడు నెత్తినోరు కొట్టుకొని ఏం ప్రయోజనము?...... మళ్ళీ ఏడుస్తున్నాడే రామిగాడు...ఏదో అన్నట్లున్నారు వాడ్ని...మధ్య తనకి చావొచ్చిపడింది... యీ పిల్లలతో! చెయ్యికడుక్కొని లేచింది తను.

* * *

అంట్లు తోముకుంటూంది తను. 'ఈ అంట్లన్నీ శుభ్రంగా తోమాలి' అనే ధ్యాస తప్పితే మరేమీ లేదు తనకి. ఎక్కడైనా మకిలి కొంచెంవుందంటే, తెల్లారి మళ్ళీ తనే నాటిని చచ్చినట్లు తోమాలసి వస్తుంది. కాకపోయినా, యిన్ని కాక మరిన్ని అంట్లున్నా తనకేమీ కష్టంలేదు. చిన్నప్పటినుంచీ తను చేస్తూన్న పనేయిది. కాని, అంట్లు కనక త్వరగా తోమి బయటపడకపోతే మామగారివద్దనుంచి పిల్లలవరకు, అంతా ఎక్కడి వాళ్ళక్కడ నిద్ర పోతారు ఒక్కొక్కళ్ళను పేరుపేరునా లేవదీసి, మంచాలూ ప్రక్కలూ వేసి మళ్ళీవాళ్ళకు నిద్రలు పట్టేవరకు సేవచెయ్యాలి. ఇంతలో 'అమ్మా' అంటూ ఏడుపు మొదలెట్టేడు రాముడు వాకిట్లో.

భోజనానికి కూర్చున్న తన అత్తగారు, తనను సంబోధించి 'కుర్రాడు ఏడుస్తూన్నాడే' అని అన్నది. ఒకసారి ఏడ్చే కుర్రాడినయితే తనేమైనా వూరుకో బెట్టగలుగుగాని, రోజస్తమానం ఏడ్చే వాళ్ళను తనేంచెయ్యగలదు? అత్తగారు లేచి విసుక్కుంటూ వసారాలోకి వెళ్ళింది. ముందుకుపోతే నుయ్యి. వెనక్కుపోతే గొయ్యి యీ పాడు పిల్లలతో పగవాళ్ళకైనా వద్దు యిట్టాంటి సంతానం అన్పిస్తుంది. ఒక్క క్షణం వూరికేవుండరు. అకలో, నొప్పో, మరేమిటీడో గాని, సర్వకాల సర్వావస్థల ఎవరోవకరు ఏడుస్తూనే వుంటారీ పాడుకొంపలో. ఏడ్చేడ్చి సోపవస్తేగాని పడుకోరు. వీడి తర్వాత ఆడపిల్ల లేస్తుంది. రాక్షసిలాగ చెవులు చిల్లులు పడేట్లు మొదలు పెడుతుందదిక. తను నిద్రపట్టక కోపమొచ్చి రెండు వాయిస్తుంది. ఎప్పుడో వక వేళ కొంచెము నిద్రపడ్తూందనగా ఆఖరివాడు లేస్తాడు. వాడికి అస్తమానం పాలుకావాలి. తల్లిపాలు!

అత్తగారు గొణుక్కుంటూ తిరిగివచ్చి తిరిగి కూర్చుంది, మళ్ళీ భోజనానికి. ఏడుపు మొదలెట్టాడు రాముడు. ఇంకా అంట్ల గిన్నెలు బోలెడున్నాయి తోమితోమి తన చేతులరిగిపోతున్నాయి! 'కుర్రవెధవ ఏడ్తున్నాడని త్వరత్వరగా తెమల్చడం అదీ ఏమైనా వుంటేనా...ఏం నాజూకో మా అమ్మ!' అంటూ దెప్పడం ప్రారంభించింది అత్తగారు ఒకవైపు చేతులు మండిపోతూంటే, మరోవైపునుంచి యిదో రాపిడి! వళ్ళుమండింది తనకు. "ఏడ్చేడ్చి చస్తాడు, చావనీండి." అన్నది తను. కాని వంటనే కళ్ళవెంబడి నీళ్ళు తిరిగేయి తనకి. ఎంతమాట అన్నది తను! ఈ కోపంలో నోటికి ఎంతవస్తే అంత మాట్లాడేస్తుంది తను. ఆ భయంతోటేగా అసలు తను ఎవరెన్ని అన్నా నోరు మూసుకొని యీ సంసారాన్ని యీదుకొస్తూన్నది. అలా కాకుండా అందరిలాగా తనూ అయితే, బాగానే వుండేది. తనేం సావిత్రిలాగ ఒక్కసారైనా అత్తగారిని ఎదిరించగల్గిందా! కామేశ్వరిలాగ సినిమాకు తీసికెళితే గాని వీలులేదని మొగుడిని నిగ్గతీసి అడగగల్గిందా? అయోగ్యరాత. కాపరానికొచ్చి యిన్నేళ్ళయ్యింది; తనొక్క సినిమా చూచిందీ? సినిమాలసంగతి అట్లావుంచి, రాజోలు, నర్సాపురము బెజవాడ స్టేషన్లు తప్ప తనేమి ఎరుగును! అలమారులోని బొద్దింకలాగ తనువంటింటి పనితప్ప యింకేమీ

ఎరుగదు వంటయిల్లు కాకుండా మరోటివుందని తెల్సుకోడానికికూడా తనకు వ్యవధివుంటేనా? తెల్లవారుఝామున లేచింది మొదలు స్నానాలు, వంటలు, భోజనాలు, అంట్లు, మళ్ళీ స్నానాలు, బట్టలుతుక్కోవడం, వంటలు, భోజనాలు, అంట్లు, ప్రక్కబట్టలు! ఇవన్నీ మాముకునేసరికి ఎక్కడికో పోతుంది, తన ప్రాణం! ఒళ్ళు తెలియని నిద్ర ఆవేసిస్తుంది తన శరీరాన్ని.

అంట్లగిన్నెలు తోముకొని, వంటిల్లు సర్దుకొని తలుపులు బిగించి బయటకొచ్చేసరికి, రాముడివద్ద నుంచి అత్తగారివరకు అంతా ఎక్కడివాళ్ళక్కడ నిద్రపోతూన్నారు. నిట్టూరుస్తూ, ప్రక్కబట్టలైనా పరుచుకోకుండానే చాపమీద నడుము వాల్చింది తను.

అయిదు నిమిషాలన్నా అవ్వలేదు. "శ్యామలా," అంటూ మామగారు పిలవసాగేరు. ఏమైనాసరేనని మాట్లాడక పరుంది తను, అట్లాగే.

మళ్ళీ "శ్యామలా, శ్యామలా—కొస్త మజ్జిగ వుంటే యిద్దూ... కళ్ళు మండుతున్నాయి." అంటూన్నారు

"పడుకుందురూ, యిప్పుడెక్కడిది—మజ్జిగ?" అని గద్దించి, తను కళ్ళుమూసుకుంది.

* * *

తెల్లవారేక, సత్యం డ్యూటీనుంచి యింటికి వస్తూ ఆలోచించసాగేడు. ఏమిటీ జీవితం, అని. ఇంటికివడితే బియ్యంవుండవు. కొనితేవాలని నిన్న సాయంత్రమే హెచ్చరించింది తనతల్లి. కొని తీసుకొని వెళ్ళడానికా పైకం తక్కువగావుంది. ఇక తన తండ్రి ఆరోగ్యం మాద్దామంటేనా దినదినానికి క్షీణించిపోతూంది. డాక్టరుకు చూపిద్దామంటే, మందులకి డబ్బుండాలి. ఎప్పటికప్పుడు మంచి రోజులు ముందున్నాయి, అనే అచంచల విశ్వాసంతోవున్న తనకుకూడా నిస్పృహకలిగి ఏమిటీ జీవితం? ఈ కష్టాలకు అంతెప్పుడు అని అన్పిస్తూంటుంది.

ఏమిటీ జీవితం అంటే? ఆలోచించడానికి వలసినంత వ్యవధి వున్నవాళ్ళకు చాలా అద్భుతమైన ప్రశ్న యిది. చీకూచింత లేని వాళ్ళూ, ధనవంతులూ వేసుకోవలసిన ప్రశ్న యిది. క్షణక్షణానికీ బియ్యపు సమస్యలను, పిల్లల ఆరోగ్యపు సమస్యలనూ, తండ్రి మనస్థిమితపు సమస్యలను పరిష్కరించవలసిన తనకు యిట్లాంటివాటిని గురించి చింతించడం అర్థంలేనిపని ఎప్పుడో తీరికవున్నప్పుడు ఆలోచించాలి అసలు జీవితం అంటే ఏమిటో?

మీద పడబోతూన్న సైకిలు రిక్షాను తప్పించుకొని, చుట్టూ చూచేడు అతను. ఎదురుగుండా కిళ్ళీకొట్టు అవుపించింది. జేబూలోనికి చేతిని పోనిచ్చేడతను. జేబులో బేడ చల్లగా తగిలింది, చేతి వ్రేళ్ళకు. బేడను బయటకులాగి, గోల్డుఫ్లేక్, సిగరెట్టు వకటి యిమ్మని, కిళ్ళీకొట్టు వానిని అడగబోయేడతను. ఆకస్మికంగా, యింట్లోకి అగ్గిపెట్టెలు లేవని, భార్య నిన్న సణగడం గుర్తుకొచ్చింది అతనికి. వక అగ్గిపెట్టె అర్ధణా బీడీలు తీసుకొని, చిల్లరా అర్ధణా జేబూలో వేసుకొని, ముందుకు రెండడుగులు వేసేడు సత్యం. 'బాబా కానీ' అంటూ కుష్టువాడొకడు చేతిని ముందుకు చాచేడు. జేబూలోని అర్ధణా కాసును నేలమీదపడేసి జలదరిస్తూన్న శరీరంతో ముందుకు వేగంగా అడుగులు వేయసాగేడు అతను.

నడుస్తూన్న సత్యానికి ఆకస్మికంగా అనుమానం కల్గింది, యిదంతా అసలు జీవితమేనా, అని! బహుశా తామే లోకంలోనన్నా చనిపోయి యిక్కడికొచ్చేరేమో! ఈ లోకంలో చనిపోయినవాళ్ళు మరే లోకానకోపోయినట్లు, ఎక్కడో పోయిన తామంతా యిక్కడ ఫలితం అనుభవిస్తున్నారేమో? ఇదే జీవితమైతే ఎక్కడచూచినా యీ బాధలూ, రోగాలూ, అశాంతి, అధర్మం ఏమిటి?

బాధాకరమైన ఆలోచనల్నుంచి తప్పించుకోడానికి అన్నట్లు సత్యం వక్కక్షణం రోడ్డుమీద ఆగిపోయి, బీడీ ముట్టించుకొని మళ్ళీ నడువసాగేడు. సత్యానికి, ముద్దు ముద్దు మాటలాడే రాముడు గుర్తుకు వచ్చేడు. రాముడి మాటలు వకటొకటే స్ఫురణకు రాగానే జీవితం అనుకున్నంత ఎడారి కాదన్పించింది. జీవితంలోనూ అక్కడక్కడ ఆనందం వుందనిపించింది. వెన్వెంటనే డోకులు డోక్కునే భార్య గుర్తుకొచ్చింది. జీవితమంటే తన భార్యకు తినడమూ, పిల్లలను కనడం, వంటింటి పనిచూచుకోవడమూ! అవును, అంతే. అంతకంటె ఏమెరుగును అది. అమితంగ జాలి వేసింది అతనికి తన భార్యమీద. జాలి! ఎందుకొచ్చిన జాలి తను తన తలితండ్రులపైన మాత్రం ఎంత జాలిపడటం లేదూ? కాని తను ఏం చెయ్యగలిగేడు వాళ్ళకు! తనకున్నంతలో ఏదో యింత అన్నము పెడుతున్నాడనుకో. తల్లికి వక మంచిచీర గాని, తండ్రికి......! అంత బాధలోనూ నవ్వొచ్చింది అతనికి, తండ్రి కోరికలు గుర్తురాగానే. ఆయనకు కళ్ళజోడు కావాలి, రాజా పెన్ను కావాలి, ఆ రాజా పెన్నుతో వ్రాయడానికి ఎక్కడైనా వుద్యోగం కావాలి మందులుకూడా కావాలనుకో, కాని ఆయన ఎన్నడూ అవి కావాలనరు. ఆయన ముఖ్యంగా కావాలనేదిల్లా వుద్యోగం... వుద్యోగం!...

ఎందుకో నిన్న వుదయం సంగతి జ్ఞాపకానికి వచ్చింది సత్యానికి, తను నిన్న.........

గుమ్మములోకి అడుగు పెడుతూండగానే తల్లి చెప్పింది "వచ్చేవా నాయనా! మీ నాన్నగారికి తలనొప్పి, కళ్ళు మంటలూను! ఆ కళ్ళజోడు ఏదో యివ్వేళ కొని పెట్టి తీరాలిట!"

"ఏమండీ - కళ్ళు మండుతున్నాయా... అట్లానే, రేపు బజారు వెళ్ళినప్పుడు తెస్తాను. కాస్త మజ్జిగ యివ్వకపోయేవుటే, చల్లగా నాన్నగారికి." అన్నాడు తను లోపలికి వెళ్ళుతూ.

"నాకు వుత్తరం ఏమైనా వొచ్చిందేమో అడుగు, అబ్బాయిని" అంటున్నారు నాన్నగారు. తను విననట్లే వూరుకున్నాడు.

"ఊ తరం! మీకూ నాకూ వుత్తరాలు ఎవరూ రాసేది?" అన్నది తన తల్లి.

"రాసేవాళ్ళే రాస్తారు. అబ్బబ్బ...తల, నొప్పితో పగిలిపోతూందే."

"కొంచెం గంథము అరగతీసి రాయమంటారా" అడుగుతోంది తన భార్య మామగారిని.

"ఏమిటి రాయడం?" అడిగేడు తను కాళ్లు కడుక్కొని వస్తూ, ఏమీ విననట్లు.

"వుత్తరాలేమన్నా వచ్చేయా?" అడిగేడు తన తండ్రి.

"ఎవరికీ—మీకా, నాకా?"

"నాకే."

"ఎవరూ రాసేది."

"ఉన్నారులేగాని, వున్నాయా?"

"మళ్లీ ఎవరికయినా రాస్తున్నారా - వుద్యోగం యిప్పించమని."

"అవును. తెనాలి రాసేను."

"ఎందుకు? ఇక్కడ మీకు ఏం తక్కువయ్యిందనీ? ఏమీ బాగుండలేదా మీకిక్కడ?" అడిగేడు తను నొచ్చుకుంటూ.

"ఇక్కడ మిమ్మల్ని ఎవరైనా అవమానం చేస్తున్నారా? ఎందుకు మీకీ గొడవలు - హాయిగా తిని కూర్చోక." అన్నది తన తల్లి.

"ఇందుకేనా, రోజూ కళ్ళజోడనీ, కలమనీ అడుగుతూన్నారు. ఏం, యిక్కడ లక్షణంగా భోజనం చేసి కూర్చోవటం మీకు నామర్దాగా వున్నదా?" అడిగేడు తను.

"నామర్దా ఏమిటిగాని, పురుషుడయ్యేక ఏదో వక వుద్యోగం చెయ్యాలిగా!" అన్నారు ఆయన.

"చేసేరుగా! అరవయి ఏళ్ళు వచ్చేవరకూ చేసేరు, చాలు." మందలింపుగా అన్నది తన తల్లి.

"మీరు సంపాదించటం లేదని ఎవరైనా అన్నారా?" తను అడిగేడు లాలింపుగా.

"ఊహు."

"మీరు కూర్చుంటే లేవలేరుకదా, తెనాలి వెళ్లి షావుకారు గుమాస్తాపని ఎట్లా చేద్దామనుకున్నారు? కలం వణకకుండా రెండు నిమిషాలు పట్టుకోలేరు కదా! అయినా ఎందుకు మీకీ అవస్థ యింకా. హాయిగా, క్రిష్ణా రామా అనుకుంటూ కూర్చోక." అన్నాడు తను.

"నువ్వు నాలీచాలక అవస్థపడుతూంటే నేను ఎట్లా వూరికే కూర్చోను?" అన్నారాయన వున్నట్లుండి...శూన్యంలోకి చూస్తూ.

"కూర్చోక ఏంచెయ్యగలనని? కూర్చోవాలి, కొంత వయస్సొచ్చేక. నా అవస్థ నేనుపడి తెస్తున్నానుగా..."

"ఆయనతో ఏమిటిగాని, నువ్వు భోజనానికి లేనాయనా, ఆలస్య మవుతూన్నది." అన్నది తన తల్లి.

"భోజనం చేసేరా! ఊ. చేస్తే, ఆ మంచం మీద క్రిష్ణారామా అనుకుంటూ హాయిగా పడుకోండి." తండ్రితో నిశ్చయంగా చెప్పి తను భోజనానికి లేచేడు. ముసలాయన అప్పుడుగాని మాట్లాడకుండా పడుకో లేదు.

ఏమిటో, ముసలాయనకీ మధ్య అసలు మన స్థిమితం పూర్తిగాపోతూంది! తనిప్పుడు యింటికెళ్ళేసరికి పట్టుపంచ కట్టుకొని యిల్లంతా అలంగం తిరుగుతూంటారు. ఇంకా ఎనిమిదన్నా అవకుండానే భోజనం ఎమిటో......

సత్యం తమ వీధిలోనికి వచ్చేసరికి, తమ గుమ్మముముందు నలుగురైదుగురు నిలబడివున్నారు. తన తల్లి దిగులుగా అరుగుమీద కూలబడివున్నది. ఏమిటది? ఏం జరిగింది? తడబడే కాళ్ళతో త్వరితంగా ముందుకునడిచేడు సత్యం. గుమ్మములో అడుగు పెడుతూండగానే అతనితల్లి ఆదుర్దాగా "ప్రొద్దుటినుంచి మీ నాన్నగారు అవుపించడం లేదురా... ఎక్కడికెళ్ళేరో ఏమో?" అన్నది.

"రంగయ్యగారింట్లోను, సుబ్బాయమ్మగారింట్లోను చూసి వచ్చేము. అక్కడా లేరు." అని కలిపింది శ్యామల.

"తాతయ్యో - మరే - ఎక్కడో పోయేరు" అంటున్నాడు రాముడు చేతులు వంకరగా త్రిప్పుకుంటూ.

ఎక్కడకు వెళ్ళివుంటారు? అకస్మికంగా మెదడు శూన్యమైపోయినట్లు నిపించసాగింది సత్యానికి. ఏమి చెయ్యాలో, ఎట్లా ప్రారంభించాలో తోచటంలేదు. 'కొంపతీసి ఆయన ఏ అఘాయిత్యమూ చెయ్యలేదుకదా' అనే ఆలోచన వున్నట్లుండి మెదిలింది. చాలా అసహ్యంగా అవుపించిందా ఆలోచన. అటువంటి ఆలోచనవచ్చినందుకు తనపైన తనకే అసహ్యం కల్గింది. ఆ భావాన్ని తోసివెయ్యడానికి ప్రయత్నించేడతను, 'ఏ బజారోవెళ్ళివుంటారు' అని నచ్చ చెప్పుకో యత్నిస్తూ. కాని వెంటనే మరల పూర్వపు ఆలోచనే, గబ్బిలంలాగ గిర్రున తిరుగసాగింది బుర్రలో.

"రాత్రి ఆయనను ఎవరైనా ఏమైనా అన్నారా?" అడిగేడతను, ఏదో వకటి మాట్లాడాలనే వుద్దేశంతో—అట్టే ఆలోచన లేకుండానే.

"ఎవరేమంటార్రా? భోజనం చేసి ఆయన హాయిగా పడుకుంటేను!" తల్లి చెప్పింది.

"వస్తానుండండి" అంటూనే తిన్నగా కాలువవడ్డుపైపే నడిచేడు సత్యం! జ్వరపు శరీరంలాగ వళ్ళంతా వణుకుతూండగా వంతెనపై నిలబడి చుట్టూ చూచేడతను. ఏమిటి తను చేస్తున్న పని? తన తండ్రి శవముకోరకు చూస్తున్నాడా? కాదు. మరెందుకు? అంగీకరించడానికి అతనికి అవమానకరంగా కన్పించింది. నెమ్మదిగా నిట్టూర్చి, యింటికి తిరుగుముఖం పట్టి వస్తూండగా, వక వేళ తన తండ్రి రాజమండ్రిగాని, తెనాలిగాని వెళ్ళివుండడు కదా అనే ఆలోచన తట్టింది. అవును. సమంజసంగానే వుందీ ఆలోచన, అనుకున్నాడతను. తప్పక ఆయనేదో వుద్యోగప్రయత్నంలో ఎక్కడికో వెళ్ళివుంటారు. తను అనవసరంగా భయపడ్డాడు. అనవసరం ఏమిటి? ఇప్పుడు మాత్రం భయం లేకుండా ఎక్కడున్నది? ఇంత రోగిష్టిమనిషి ఎట్లా రైలెక్కగలరు, ఎట్లా దిగగలరు? ఒంటరిగా ఎట్లా నడపగలరు? దారిమధ్యలో కూలిపడిపోతే ఎవరు దిక్కు!

"తెనాలో, రాజమండ్రో వెళ్ళివుంటారు. మీరేమీ ఖంగారుపడకండి, నేను వెళ్ళివస్తాను" అని భార్యకు, తల్లికీ ధైర్యం చెప్పి అలమారులోవున్న రెండు రూపాయలూ జేబూలో వేసుకొని స్టేషనుకు పరుగెత్తేడు సత్యం. అదృష్టవశాత్తు తెనాలిపోయే రైలు, స్టేషనులో సిద్ధంగావుండటంవల్ల, తెనాలి వక టికట్టు తీసుకొని, ఆయాసపడుతూనే పరుగెత్తుకుంటూ రైలులో వెళ్ళి పడ్డాడు సత్యం.

పరుగెడుతూన్న రైలులో కూర్చొని ఆయాసం అనునయించుకుంటూన్న సత్యాన్ని, ఆలోచనలు మాత్రం వదలలేదు. నిర్దయతో వెంటనే వేధించసాగినయి. ఒక వేళ తన తండ్రి రాజమండ్రిలో గాని, తెనాలిలో గాని వుండకపోతే! తెనాలిలో అయినా తను ఎక్కడని వెదికేది? ఆయనకు మతి తిన్నగా వుండివుంటే, తను ఆయనకోసం, తెలిసిన షాపుల్లో విచారించవచ్చును. ఆయన ఎక్కడ తిరుగుతున్నారో? ఎక్కడ పడిపోయేరో! జన్మజన్మాంతరాలనుండి పగపట్టినట్లు యీపాడు ఆలోచన లేమిటో? ఎట్లా వ్రాసివుంటే అట్లా అవుతుంది. తను యిక ఆలోచించడు. కాస్సేపు ప్రకృతిని చూచి ఆనందిస్తాను, అనుకుంటూ) పరుగెత్తి అదృశ్యమయిపోతూన్న పొలాలను చూడసాగేడతను. ఎండనక వాననక శ్రమించి రైతులు ధాన్యం పండించబట్టే తామంతా జీవించకలుగుతున్నారు... అనుకున్నాడతను. చాలా గొప్పగా వున్నట్లనిపించింది యీ ఆలోచన. వెనువెంటనే, వకప్పుడు తమకూ పొలాలు వుండటం గుర్తుకొచ్చింది. ఒక్కొక్కటే తన తండ్రి వాటి నన్నిటినీ అమ్మివేసేడు. ఇప్పుడు......ఛీ! మళ్ళీ యీ ఆలోచనలే...

తెనాలిలో ఆగింది రైలుబండి. వెంటనే, తనకి తెలిసిన నాలుగు దుకాణాల్లోనూ తన తండ్రి జాడను గురించి విచారించాలి. ఒక వేళ ఆయన జాడ తెలియకపోతే! తెల్సినా తనతో వచ్చే స్థితిలో లేకుంటే! ఏ కాలవలోనైనా పడి, ఎక్కడికో కొట్టుకుపోతూన్నారేమో యీ సమయంలో ఛీ. ఛీ. తన మెదడు కుళ్ళిపోయింది ఏనాడో!...వీళ్ళంతా ఎంత హడావుడిగా పరుగుడుతున్నారో? ఆమె కుర్రాణ్ణి ఎట్లా ముద్దులాడుతూందో... అతనెంత అవస్థపడుతూ దగ్గుతున్నాడో!

'వెయిటింగ్ రూం' ముందున్న బల్లపైన కూర్చొని విపరీతంగా దగ్గుతూన్న అతనివైపే చూస్తూ నడుస్తూ సత్యం అనుకున్నాడు 'అబ్బే! అతనెంతో కాలం బ్రతకడు... ఆ దగ్గు అతని ప్రాణాన్ని తినేస్తోంది." ఆ దగ్గుతూన్న వ్యక్తిముఖం తనవైపు తిరిగింది, తన కండ్లు మరోవస్తువు వైపుకు ఆకర్షింపబడేలోగా, సత్యం అకస్మికంగా ఆగిపోయేడు. ఆనందాశ్చర్యాలతో అతనికండ్ల నీరు తిరిగింది. తన తండ్రి! ఇక్కడ! ఒంటిమీద బనీనైనా, కండువాయైనా లేకుండా! సత్యం నోటమాటైనా లేకుండా వచ్చి తండ్రి ప్రక్కనే కూర్చొన్నాడు. ముసలి ఆయన సత్యాన్ని చూచేడు గాని మాటాడలేదు.

యిద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు అయిదు నిమిషాలు.

“లేచి, ఒక సోడా తీసుకురానా?” అడిగేడు సత్యం.

ముసలిఆయన మౌనంగానే తలవూగించేడు. సత్యం లేచి, సోడా వకటి తీసుకొనివచ్చి యిచ్చేడు. ముసలాయన ఆయాసపడుతూనే సోడాను త్రాగి త్రేన్చేడు. ఖాళీసోడాను కొట్టులోయిచ్చేసి సత్యం తిరిగివచ్చి తండ్రి ప్రక్కను కూర్చొని అడిగేడు, “ఇంటికి వెళ్ళిపోదాము—వస్తారా?”

ముసలిఆయన శూన్యంలోనికి చూస్తూకూర్చొని వున్నాడు—పలుకైనా లేకుండా.

సత్యం వక్క క్షణం ఆగి, తండ్రిముఖం వంకే బాధగా చూస్తూ, అన్నాడు “నేనొక్క మాట చెబుతాను వింటారా? తిన్నగా యింటికి వెళ్ళిపోదాము, రండి. మీకొక రాజా కలం కొని తెచ్చేను. అమ్మేమో ఎక్సరుసైజు పుస్తకాలు కుట్టి రూళ్ళు వేస్తోంది. ఆ కలంతో మీకు శక్తివున్నంత వరకూ రామకోటి రాయండి. రేపు జీతాలురాగానే కండ్లజోడు, భగవద్గీతకూడా కొనితెస్తాను. తీరిక వున్నప్పుడల్లా అది చదువుకోండి. మీరేవుద్యోగమూ చెయ్యనక్కరలేదు. ఇంటి విషయాలన్నీ నేను చూచుకుంటాను — మీకెందుకు? మన నలుగురికీ వందరూపాయలు చాలకపోవడమేమిటి, ఎవరైనా వింటే నవ్వుతారు! లేవండిక. ఇంకా కావలిస్తే, ప్రస్తుతానికి నా యీ ‘పైలట్’ కలం మీవద్దవుంచుకోండి. ఇదిగో జాగ్రత్తగా పట్టుకోండి. ఏం పోదామా, మన వూరు...బండీ టైమవుతోంది.”

ముసలాయన ఆలోచనతో అనిశ్చయంగా వూరుకున్నాడు, కలాన్ని చేతిలోకి తీసికొనికూడా.

“మిమ్మల్ని ఎవడైనా ఏమైనా అంటే నాతో చెప్పండి—చర్మం చీరేస్తాను. అయినా ఎవరేమనుకుంటే మీకేమిటి! దొరగారిలాగ హాయిగా కుర్చీలో కూర్చొని, నిశ్చింతగా కొత్తకలంతో రామకోటి రాసుకోక! రేపటినుంచీ మీరెవ్వరితోటీ మాటాడనక్కరలేదు కూడాను. ఎనిమిది గంటలకల్లా మన కుర్చీలోకూర్చొని రామకోటి ప్రారంభించండి. మీకు ఎప్పుడు పసుగెత్తితే అప్పుడు మానివేయండి. శుభ్రంగా కృష్ణా, రామా అనుకుంటూ మెత్తటి పరుపుమీద పడుకోండి. అదే మీడ్యూటీ యిక. ఏం? లేవండిక.”

ముసలాయన తలవూగించేడు చెమ్మగిల్లే కండ్లతో.

అప్పుడేవచ్చి ఆగివున్న రైలు’ తండ్రి నెక్కించి, వనకాలే తనూ లోపలికి ఎక్కేడు సత్యం.

ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చొన్నారు, వకరి ఎదురుగా మరొకరు

ముసలాయన దిగులుగా మూలిగి, “యీ వయస్సే యిటువంటిది. ఇందులో సుఖానికి, శాంతికీ తావక్కడాలేదు. లేని శాంతికోసం, వుందనుకొని ఆశతో ఎదురు చూడటమే తను చెయ్యవలసిన పని. అటువంటప్పుడు యీ శేష జీవితం ఎక్కడ గడచిపోతే నేమి?” అనుకున్నాడు.

సత్యం చిన్న నిట్టూర్పువిడిచి అనుకున్నాడు, “ఈ సంసారంలో ఎవ్వరికీ శాంతి వుండదు. ఎక్కడో, ఎప్పుడో వుంటుందనే ఆశమాత్రం ప్రబలంగా లేకపోతే తామంతా ఏమయిపోయేవారో! ప్రతీ జీవితంలోకి ఆక్షణం ఎప్పుడో అప్పుడు రాక తీరదు. అది వచ్చేవరకూ యీ అశాంతితో సమరం సలపడమే తన కర్తవ్యం. ఇదే కాబోలు జీవితం.” అనుకోసాగేడు.

ముందుకు సాగడమే తన లక్ష్యం అన్నట్లు రైలుబండి చెవులు చిల్లులుబడేట్లు వకమారుకూసి, వేగంగా పరుగిడ సాగింది—ముందుకు.